క్లుప్తంగా

వేంకటేశ్వర కల్యాణం



కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

వేంసూరు: మండల పరిధిలోని రాయుడుపాలెంలో కొలువైయున్న వెంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

కేసీఆర్‌ను కలిసిన సండ్ర



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సండ్ర

సత్తుపల్లి: సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య శనివారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన



జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ

బోనకల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంతోపాటు పంచాయతీ కార్యాలయాల్లో శనివారం ఓటర్ల ముసాయిదా జాబితాను శనివారం ప్రదర్శించారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8 లోపు లిఖిత పూర్వకంగా దరఖాస్తులను కార్యదర్శులకు అందజేయాలని ఎంపీడీవో రమాదేవి కోరారు.

రెచ్చగొట్టేలా పోస్టు పెట్టిన వ్యక్తిపై కేసు

కల్లూరురూరల్: మండలంలోని వెన్నవెల్లికి చెందిన మత్తి గోపాలరావుపై శనివారం బైండోవర్ కేసు నమోదు చేశారు. గ్రామంలో వినాయక నిమజ్జనం నేపథ్యాన ఆయన సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశమున్నందున ఎస్సై హరిత శనివారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహసీల్దార్ పులి సాంబశివుడు ఎదుట బైండోవర్ చేశారు. పండుగల వేళ సామరస్యంతో మెలగాలే తప్ప సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థానాలకు..



నర్సింహారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: క్రమశిక్షణతో చదువుకునే విద్యార్థులు ఉన్నతమైన స్థానాలకు చేరుకుంటారని డాక్టర్ ఆచార్య పింగళి నర్సింహారావు అన్నారు. శనివారం మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణ ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ అంకసాల సాంబశివరావు మాట్లాడుతూ.. చదువుతోనే ప్రాధాన్యత గల వ్యక్తులుగా తయారవుతారన్నారు. వక్తలను ప్రిన్సిపాల్ చావా జ్యోతి, ఉపాధ్యాయులు సిబ్బంది సత్కరించారు.

కాంగ్రెస్‌లోకి చేరిక

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శనివారం పలువురు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వారికి ఏఎంసీ మాజీ చైర్మన్ బంధం శ్రీను, జిల్లా కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బోయినపల్లి వెంకటేశ్వరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షాజహాన్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్తాఫా, షేక్ చాంద్ సాహెబ్, దొడ్డ నాగేశ్వరరావు, జాన్‌మియా, మురళి పాల్గొన్నారు.

రైతు సదస్సును జయప్రదం చేయాలి

చింతకాని: ఈనెల 10న ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞానకేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతుసదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని నాగిలిగొండలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాలో కార్మికులు, మహిళలు పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరావు, గౌరవాధ్యక్షుడు రవీంద్రబాబు, మండల కార్యదర్శి గోపాలరావు, మల్లికార్జున్‌రావు, వెంకటనర్సయ్య, చిన్నజాన్, రమేష్ ఉన్నారు.

నటనలో సత్యకీర్తి..



నాటకరంగంలో రాణిస్తున్న సత్యకుమారి

- తండ్రి ప్రోత్సాహంతో ప్రవేశం
- అంతరించిపోతున్న కళకు ప్రాణం పోస్తున్న కళాకారిణి
- సత్యహరిశ్చంద్ర చంద్రమతి పాత్రతో గుర్తింపు

చక్కని ఆహార్యం ఆమె సొంతం.. రంగస్థలంపైకి ఆమె ప్రవేశిస్తే ప్రేక్షకులు మైమరిచిపోతారు.. అంతలా ఆమె నటన రంజింపచేస్తుంది. స్త్రీ, పురుషుల పాత్ర ఏదైనా అలవోకగా నటిస్తూ నాటకానికి జీవం పోస్తారు. అతికొద్ది చదువుతోనే పద్యాలను సులువుగా, అలవోకగా చెప్పటం, పాడటం ఆమె ప్రత్యేకత.. మండలంలోని ఎర్రబంజరు గ్రామానికి చెందిన నంద్యాల సక్కు అలియాస్ సత్యకుమారి పౌరాణికం, సాంఘికం, జానపద నాటకాలు, బుర్రకథలు ప్రదర్శిస్తూ గత 30 ఏళ్లుగా రాణిస్తోంది.

– కల్లూరురూరల్

సండే స్పెషల్

తండ్రి నుండి వారసత్వం

ఎర్రబంజరు గ్రామానికి చెందిన పైళ్ల రాఘవులు ఆలనాటి నాటక రంగ కళాకారుడు. ఆయన కుమార్తె సత్యకుమారిని చిన్ననాటి నుండి ప్రదర్శనలకు తీసుకెళ్తుండడంతో నాటక రంగంపై ఆసక్తి పెంచుకున్నారు. తండ్రి ప్రోత్సాహంతో వీరయ్య నాయుడు, పిచ్చేశ్వరరావు తదితరుల వద్ద శిక్షణ తీసుకుని 15వ ఏటా రంగస్థలంపై కాలు మోపారు. ప్రస్తుతం సత్యకుమారి వయస్సు 50 ఏళ్లు కాగా.. 35 ఏళ్ల నుంచి నాటక రంగస్థలంపై విభిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకుల ప్రశంసలతో పాటు అనేక బిరుదులు, సత్కారాలు పొందారు. జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు సైతం గెలుచుకున్నారు. ఇదిలా ఉండగా సత్యకుమారి ఒక ఏడాదిలోనే 60కి పైగా ప్రదర్శనలు ఇచ్చి రికార్డు సృష్టించారు.



అవార్డు అందుకుంటున్న సత్యకుమారి (ఫైల్)

చదువు లేకపోయినా.. సంక్లిష్టమైన పద్యాలు

నంద్యాలకు సక్కు(సత్యకుమారి) కొద్దిపాటి చదువుతో రంగస్థలంపై అత్యంత కఠినమైన సంక్లిష్టమైన పద్యాలు అలవోకగా ఆలాపించటం విశేషం. ఏ పద్యం గాని, పాటగాని ఒక సారి విన్నట్లయితే వెంటనే దానిని పాడి వినిపించటం సత్యకుమారి ప్రత్యేకత. చదువు లేకపోయినా.. రంగస్థలంపై అనేక పాత్రలు పోషించి, తాను నమ్ముకున్న కళామతల్లికి విశిష్టమైన సేవలు చేయటం అభినందనీయం.

గుర్తింపు తెచ్చిన పాత్రలు..

సత్య హరిశ్చంద్ర నాటకంలో చంద్రమతి పోషించిన పాత్రకు ఎక్కువ బహుమతులు వచ్చాయి. చంద్రమతి పాత్రకు జీవం పోసిన సత్యకుమారి ఉత్తమ కళాకారుణిగా విశేష గుర్తింపు పొందారు. బ్రహ్మంగారి నాటకంలో ఆదామ్ బి, ఈశ్వరి, ఇలాంటి పాత్రలు, రామాంజనేయ యుద్ధం నాటకంలో శాంతిమతి, తిరుపతమ్మ నాటకంలో తల్లి పాత్ర, పూల రంగడు నాటకంలో ఎస్సై పాత ఇలా లింగ బేధం లేకుండా కళాభిమానులను అలరించే పాత్రలు పోషించి మెప్పిస్తున్నారు.

వరించిన అవార్డులు.. బిరుదులు..

సత్యకుమారి 2016 సంవత్సరంలో కళా సౌరభ అవార్డును అందుకున్నారు. 2017లో విశాఖపట్నంకు చెందిన మదర్‌థెరిస్సా ఫౌండేషన్ ఉగాది పురస్కారం, అదే విధంగా 2018 సంవత్సరంలో వే ఫౌండేషన్ జాతీయ స్థాయి కళాకారుని అవార్డు, 2023లో కళావాణి బిరుదుతో పాటు బంగారు అంగుళికం అందుకున్నారు. వీటితో పాటు గాంధర్వ గాయని, గాన సుధా, నట గాన, మంజరి, జూనియర్ గూడూరు సావిత్రి, కళా సార్వభౌమ, గాన నట కోకిల నాట్య మయూరి, మాధుర్య గాన కోకిల, కళావాణి బిరుదులు పొందారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక జిల్లాల్లో నంద్యాల సత్యకుమారి నాటక ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకుల చేత శభాష్ అనిపించుకున్నారు.



అవార్డులతో సత్యకుమారి

పేద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

గత 35 ఏళ్లుగా కళా నాటక రంగంలో కొనసాగుతున్నాను. నాకు ఇంత వరకు ప్రభుత్వం నుండి ఎటువంటి ప్రోత్సాహం లభించలేదు. పేద కళాకారులకు, వృద్ధ కళాకారులకు ప్రభుత్వం పెన్షన్‌తో పాటుగా పక్కా గృహం మంజూరు చేసి జీవనోపాధి కోసం చర్యలు చేపట్టాలి. ఖమ్మం జిల్లాలో తాను సీనియర్ కళాకారిణిగా ఉన్నాను. ప్రభుత్వం పేద కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు.

– నంద్యాల సత్యకుమారి

యూరియా లేక ఎదగని పైర్లు



రైతులతో మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

తల్లాడ: ఈ ఖరీఫ్ సీజన్లో ఎకరానికి ఒక్క యూరియా కట్ట కూడా అందక పైర్లు ఎదుగుదల లేక గిడసబారి పోతున్నాయని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. మండలంలోని అన్నారుగూడెంలో శనివారం ఆయన పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పంపించిన యూరియాను రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రైతులకు అన్యాయం చేస్తుందని, అందుకే రైతులు రోడ్ల మీదకు రావాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతులను మోసం చేయడానికే వ్యవసాయ మంత్రి తుమ్మల కేంద్రంపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారనాన్నారు. అనంతరం తల్లాడ వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, పెరికె కిరణ్, వాడవల్లి నాగేశ్వరరావు, తమ్మిశెట్టి కృష్ణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి నిమజ్జన వేడుక

నవరాత్రుల సందర్భంగా మండపాల్లో పూజలందుకున్న గణనాథుడికి భక్తులు వీడ్కోలు పలికారు. ఈ మేరకు శనివారం గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను వాహనాలపై ఉంచి ఊరేగింపు, శోభాయాత్ర నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో లడ్డూ వేలంపాట నిర్వహించారు. అనంతరం దప్పుచప్పుళ్ల నడుమ కోలాటాలతో నృత్యాలు చేస్తూ బాణాసంచా కాలుస్తూ పురవీధుల్లో గణేషుడ్ని ఊరేగించి నిమజ్జనానికి తరలివెళ్లారు. పలుచోట్ల దగ్గరలోని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: గణనాథుల శోభాయాత్ర



వైరా: నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



తల్లాడ: శ్రీ కృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలంపాటలో రూ.6,666కు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి



ముదిగొండ: కమలాపురంలో..



వేంసూరు: చౌడవరంలో అన్నదానం..



వైరారూరల్: ముసలిమడుగులో..



చింతకాని: లచ్చగూడెంలో..

సన్మానం..



ఉపాధ్యాయులతో లయన్స్‌క్లబ్ సభ్యులు

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలభారతి విద్యాలయంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎంఈఓ దామోదరప్రసాద్, కోటగిరి ప్రవీణ్, ఉంగరాల వెంకటేశ్వర్లుతో పాటు పలువురు ఉపాధ్యాయులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ ఆంజనేయులు, కటికి వెంకటేశ్వర్‌రావు, శీలం వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

రిటైర్డ్ టీచర్లకు..



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

కల్లూరురూరల్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 200 మంది ఆర్యవైశ్య ఉపాధ్యాయులను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజనికాంత్, దారుగుండ్ల సందీప్, వాసవీ మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు..



విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం బీసీకాలనీ ఎంపీపీఎస్ పూర్వ విద్యార్థులు తిరుమలదాసు మాధురి, సిరిగిరి మేఘన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బాసర ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన సందర్భంగా శనివారం బీసీ కాలనీ వాసులు శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటో, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను బహుమతులుగా అందజేశారు. హెచ్ఎం సుధాకర్, బాలాజీ, విద్యార్థులు ఉన్నారు.

చదువుతోనే ఉన్నత స్థాయికి..

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిటౌన్: ప్రపంచంలో ఎవరూ దొంగిలించలేనిది చదువు మాత్రమేనని, చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకొని అందరికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం 'ఇన్స్‌పైర్ అండ్ ఇగ్నైట్ సంస్థ' ఆధ్వర్యాన విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని.. సంకల్పంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. నిబద్ధతతో కూడిన క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రామయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాదె చెన్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

చింతకాని: పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్‌చంద్ర అన్నారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో పెసర పంటను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తగిన సమయంలో వాతావరణ అనుకూలతలను బట్టి పంట కోతలను చేసుకోవాలని సూచించారు. పత్తి పొలాల్లో నిల్వ ఉన్న నీటిని వెంటనే తొలగించాలని, పంటలో రోగ నిరోధక శక్తిని పెంచడానికి నీటిలో కరిగే ఎరువులను లీటర్ నీటికి 5–10 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. నానో యూరియాను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, విస్తర్ణాధికారి కార్తీక్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



పెసర పంటను పరిశీలిస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్, హిందీ, డైరీ సైన్స్ పోస్టులకు ఈ నెల 10న ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూ పద్ధతిలో అభ్యర్థుల ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ లైన్లు పునరుద్ధరించాలని ఆందోళన

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల కారణంగా విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని కోరుతూ రైతులు అఖిలపక్షం ఆధ్వర్యాన శనివారం ఆందోళన చేపట్టారు. మధిర క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళనలో పలువురు మాట్లాడారు. విద్యుత్ లైన్ల తొలగింపుతో వ్యవసాయ మోటార్లు నడవక పంటల సాగు కష్టమవుతోందని తెలిపారు. నాయకులు యంగల ఆనందరావు, కొంగర జగన్, వంగాల నర్సింహా, గాదే నర్సోత్తమరెడ్డి, సాదినేని సురేష్, ఏనుగు రవి, పెద్దప్రోలు సైదులు, వంగాల రామకృష్ణ, మడుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హామీలు వెంటనే నెరవేర్చాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని పీఎస్‌సీడబ్ల్యూయూ రీజియన్ అధ్యక్షుడు ఎ.శరత్ అన్నారు. శనివారం సత్తుపల్లి సింగరేణి మైన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న జరిగే ప్రజాభవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చలో ప్రజాభవన్ పోస్టర్లను ఆవిష్కరించారు. రమేష్, నర్సింహారావు, కనకయ్య, ప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

మధిర: పేద, మధ్యతరగతి కుటుంబాల శ్రేయస్సు కోరి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడాన్ని హర్షిస్తూ బీజేపీ మండల, టౌన్ శాఖల ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు, జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, కుంచం కృష్ణారావు, శేఖర్ రెడ్డి, సోమేశ్వరావు, బడిశా అర్జునరావు, మాదిరాజు సాయి, పగడాల నాగేంద్రబాబు, జడ కృష్ణ, నరసింహారెడ్డి, దినకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తమ ఉపాధ్యాయులు'గా అవార్డులు..

గురుపూజోత్సవం సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్‌లో శనివారం జరిగిన గురుపుజోత్సవం కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు, డీఈఓ శ్రీజ, శ్రీనివాసరెడ్డి వారికి అవార్డులు అందజేసి సన్మానించారు.



హెచ్‌ఎం భీమరాజును సన్మానిస్తున్న డీఈఓ శ్రీజ

- **మధిర:** పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో వరుసగా మూడుసార్లు నూరు శాతం ఫలితాలు సాధించినందుకుగాను మండలంలోని మర్లపాడు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం పి.భీమరాజు ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఆయన్ని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.



ఆదిల్‌షరీఫ్‌కు సన్మానం..

- **సత్తుపల్లి:** 2025–26 విద్యా సంవత్సరంలో సత్తుపల్లి మండలం రేజర్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆదిల్ షరీఫ్‌ను పాఠశాలలో అత్యధిక అడ్మిషన్లు చేయించినందుకు డీఈఓ ఘనంగా సన్మానించారు. అదేవిధంగా టెన్త్‌లో వందశాతం ఫలితాలు సాధించిన కాకర్లపల్లి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం నక్కా రాజేశ్వరరావును సన్మానించారు.



నాగేశ్వరరావుకు అవార్డు అందజేస్తున్న పీఓ రాహుల్

- **ఏన్కూరు:** మండల పరిధిలోని మూలపోచారం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు డీఎస్.నాగేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు సాధించారు. ఈ మేరకు భద్రాచలం గిరిజన భవన్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఐటీడీఓ పీఓ బి.రాహుల్ అవార్డు అందజేశారు.



అవార్డు అందుకుంటున్న శ్యాంలాల్

- **కారేపల్లి:** మండల పరిధిలోని పేరుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బాణోతు శ్యాంలాల్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు శ్యాంలాల్‌ను ఎంఈఓ జయరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.



ముదిగొండ: అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

- **ముదిగొండ:** మండలపరిధిలోని బాణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, శ్రీదేవి, శంకర్‌రావు తమ తమ విభాగాల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై సన్మానం స్వీకరించారు. ఈ మేరకు వీరిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, రిటైర్డు ఐఆర్ఎస్ ఆవులభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న పుల్లయ్య

- **బోనకల్:** మండలంలోని రావినూతల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో దామాల పుల్లయ్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. పదోతరగతిలో మండల ప్రథమ స్థానంలో పాఠశాల విద్యార్థి నిలిచినందుకు గానూ అవార్డు లభించగా పలువురు అభినందించారు.